
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నేడు యథావిధిగా స్పందన

రాజమహేంద్రవరం రూరల్ , ఫిబ్రవరి 25: రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. జిల్లా, డివిజన్, మునిసిపల్, మండల, సచివాలయం పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు గమనించాలన్నారు.

సీటు.. హీటు!



ఆశావహుల.. అటెన్షన్!

నిడదవోలులో మారనున్న సీన్

- నిడదవోలు నుంచి కందుల దుర్గేష్?
- రూరల్ నుంచి గోరంట్లే?
- త్వరలో అధికారిక ప్రకటన
- నిడదవోలు టీడీపీ నేతల్లో అలజడి
- మిగిలిన మూడు స్థానాల్లో తీవ్ర పోటీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీట్లు సిగపట్లు తప్పడం లేదు.. తొలిజాబితా విడుదల కావడంతో మిగిలిన నియోజకవర్గాల ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.. సోమవారమే మరో జాబితా విడుదలవుతుందనే సమాచారంతో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ఏ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారనేది దానిపై లెక్కల్లో మునిగితేలుతున్నారు.. టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితాలో సీట్లు సాధించిన అభ్యర్థులు ఉత్సాహంగా పోటీలో దిగగా.. ఇంకా టిక్కెట్లు కేటాయించిన నియోజకవర్గాల్లో మాత్రం తీవ్ర టెన్షన్ నెలకొంది..జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా శనివారం ప్రకటించిన జాబితాలో ముగురికి చోటిచ్చారు. ఇంకా నాలుగు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడి నుంచి ఎవరెవరు పోటీ చేస్తారనే దానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. వైసీపీలోనూ జిల్లాలో ఇంకా మూడు స్థానాలు ప్రకటించాల్సి ఉంది. దీంతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

ఏం జరుగుతోంది..

రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ పట్టుపట్టి కూర్చున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ సీటు గ్యారంటీ అని చెప్పిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తొలి జాబితాలో మొదట రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరును చేర్చినట్టు సమాచారం. కానీ రూరల్ విషయంలో కందుల దుర్గేష్‌కు స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇరుపార్టీల అధినేతలు వారి వారి అభ్యర్థులకు హామీ ఇవ్వడంతో రాజమహేంద్రవరం రూరల్ సీటుపై తర్జనభర్జన పడుతున్నారు. ఇద్దరినీ కూర్చొపెట్టి సర్దుబాటు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఇద్దరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం ఇద్దరికీ పోటీ చేసే అవకాశం ఇద్దామని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఒకరికి రూరల్ కేటాయించి, వేరే చోట మరొకరికి కేటాయిద్దామనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అవకాశం ఇచ్చి, జిల్లాలో మిగిలిన మరో జనరల్ స్థానం నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దింపడానికి నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. కందుల దుర్గేష్‌కు జనసేన వర్గాలు నచ్చచెబుతున్నట్టు సమాచారం. కొందరైతే రూరల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయమని సలహాలు ఇచ్చినా దానికి ఆయన అంగీకరించలేదని తెలిసింది. ఇంకా రూరల్ సీటు మీదే ఆయన నమ్మకం పెట్టుకున్నారు.ఈ వారంలోనే సీటు విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే నిడదవోలు టీడీపీ వర్గాల్లో అలజడి మొదలైంది. అక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ కోసం త్రీవంగా పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరినీ కాదని జనసేనకు ఇస్తారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే శేషారావు ఇంటికి వెళ్లారు. కానీ శేషారావు మాత్రం తనకు ఇంత వరకూ అధిష్ఠానం నుంచి ఎటువంటి సమాచారం రాలేదని..ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పడం గమనార్హం. కుందుల సత్యనారాయణ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉండడంతో ఆయనకు పలువురు ఫోన్‌లు చేసి పరిస్థితిని ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అధిష్ఠానం నిడదవోలు సీటు జనసేనకు ఇవ్వడానికి నిర్ణయిస్తే అక్కడి నేతలతో కూడా చర్చించే అవకాశం ఉంది. ఎన్నికలకు ఇక ఎన్నో రోజులు లేవు. త్వరలో నోటిఫికేషన్ రానుంది. ఈ సీట్ల విషయం త్వరగా తేలిపోతే ప్రజల్లో మరింతగా పనిచేసుకోవాలనే ఆలోచనతో ఆశావహులు ఉన్నారు. త్వరలో టీడీపీ, జనసేన అధినేతలు ఈ సీట్ల విషయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇక జిల్లాలో ఇప్పటికే మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డివాసు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణలను ఉమ్మడి అభ్యర్థులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ జనసేన టీడీపీ ఐక్యత కనిపించింది. రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డివాసుకు అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తిలో రామకృష్ణారెడ్డికి మర్రెడ్డి శ్రీనివాసరావు జనసేన నాయకులు అండగా నిలబడుతున్నారు.అదే విధంగా రాజానగరంలో బత్తుల బలరామకృష్ణకు టీడీపీ నాయకుడు బొడ్డు వెంకట రమణచౌదరి అండగా ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ పొత్తు ధర్మంలో భాగంగా నాయకులు కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకున్నారు. ఇంకా టీడీపీ నాలుగు చోట్ల అభ్యర్థులను ఖరారు చేయనుంది. రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించనుంది. గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారైనట్టు పార్టీవర్గాలు చెబుతున్నాయి. కానీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కొవ్వూరులో మాత్రం అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టత లేదు. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ జవహర్ ఆశిస్తున్నారు. ఒక వర్గం గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేరుతో పాటు మరికొన్ని పేర్లు సూచిస్తున్నట్టు గమనార్హం. టీడీపీ మూడు చోట్ల ప్రకటించింది. అయితే ఇరుపార్టీలు అధికారికంగా అభ్యర్థులను ప్రకటించిన నియోజకవర్గం రాజమహేంద్రవరం అర్బన్ మాత్రమే. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుంచి ఆదిరెడ్డి వాసు, వైసీపీ నుంచి ఎంపీ మార్గాని భరత్ బరిలో ఉన్నారు.ఈ ఇద్దరి మధ్యే ఇక్కడ పోటీ జరగనుంది. ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ చేసినా ప్రధాన పోటీ ఈ అభ్యర్థుల మధ్యే ఉంటుంది. ఇక ఇరుపార్టీలు అభ్యర్థులను ప్రకటించిన నియోజకవర్గాలు ఏమీ లేవు. సోమవారం ఆయా నియోజకవర్గాల సస్పెన్స్ వీడే అవకాశం ఉంది.

నిడదవోలు నుంచి పోటీ చేయమన్నారు..

- అధిష్ఠానం పిలుపు ఇచ్చింది..
- కార్యకర్తలతో మాట్లాడి వెల్లడిస్తా
- జనసేన నేత కందుల దుర్గేష్



నిడదవోలు నుంచి పోటీ చేయమని జనసేన అధిష్ఠానం నాకు చెప్పడం వాస్తవమే.నేనింకా కార్యకర్తలు, పార్టీనేతలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఒక వీడియో సందేశాన్ని పంపించారు. రాజమహేంద్రవరం రూరల్ జనసైనికులకు, వీరమహిళలకు నమ స్కారం చెబుతూ, కొన్ని పరిస్థితుల నేపథ్యంలో మన పార్టీ అధినాయ కత్వం రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి విషయంలో కొన్ని ఆలోచనలు చేస్తుందన్నారు.అది ఏ రకమైన నిర్ణయమైనప్పటికీ కూడా మన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ ఆవేశకావే శాలకు లోనుకావొద్దన్నారు. మనం ముఖ్యంగా సుక్షితులమైన సైనికుల మాదిరిగా పనిచేస్తున్నవాళ్లం.. ఎట్టిపరిస్థితులోనూ మనం సంయమనాన్ని కోల్పోవద్దని కోరారు.అంతా మంచే జరుగుతుందని, మన పార్టీని విజయం దిశగా తీసుకుని వెళ్లే విధంగా పనిచేయాలని కోరారు. పవన్‌కల్యాణ్ కూడా స్వయంగా చెప్పినట్టు సమాచారం. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా అయనతో మాట్లాడుతూ మన వాళ్ల పరిస్థితులను చక్కదిద్ది, అక్కడ నుంచి గెలిపిస్తారని కూడా ఆయనకు చెప్పినట్టు తెలిసింది.ఈ నేపథ్యంలో దుర్గేష్ జనసైనికులు, కార్యకర్తలు, తన శ్రేయాభిలాషులతో మాట్లాడి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



ఆలయంలో దీక్షను కొనసాగిస్తున్న సూర్యచంద్ర దంపతులు

కొనసాగుతున్న పాటంశెట్టి నిరసన దీక్ష

గోకవరం, ఫిబ్రవరి 25 : జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర దంపతుల నిరసన దీక్ష కొనసాగుతోంది. టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాలో జగ్గంపేట అభ్యర్థిగా టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేరును ప్రకటించడం పట్ల జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.ఈ నేపథ్యంలో ఆయన అంతిమ ఆమరణ నిరహార దీక్ష పేరుతో గోకవరం మండలం అచ్చుతాపురం కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి నుంచి నిరసనకు దిగిన సంగతి తెలిసిందే.ఆహార పానీయాలను దరి చేరనీయకుండా ఆలయంలోనే సూర్యచంద్ర, ఆయన సతీమణి శనివారం రాత్రి నుంచి దీక్ష కొనసాగించడంతో స్వల్ప అస్వస్థతకు గురైనట్టు సమా చారం. సూర్యచంద్ర సీటు నిరాకరణకు గల కారణాలను రానున్న 48 గంటల్లో వివరించాలని జనసైనికులు కోరుతున్నారు.

తూచ్ మూడ్‌న మారొచ్చు!



ఫ్యాను గాలిలో దుమారం

- బాంబు పేల్చిన వైవీ సుబ్బారెడ్డి
- వైసీపీలో ఏవరి సీటు చిరుగుతుందో
- 7 జాబితాల్లోనూ సమన్వయకర్తలే
- 3న 'సిద్ధం' సభలో అభ్యర్థుల ఖరారు
- సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల గుండెల్లో దడ
- బదిలీలు చేసిన స్థానాల్లోనూ మార్పు!
- నాలిక మడతపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పెట్టేశారు.. మళ్లీ నాలిక మడత పెట్టేశారు. వైసీపీ పెద్దలకు అలవాటైన పనే అయినప్పటికీ ఆ పార్టీ నాయకులకు మాత్రం తమ రాజకీయ భవిష్యత్తుపై వెన్నులో వణుకు అధికమైంది. ఇప్పటికే ఫ్యాను గాలి ఉన్నా స్థిమితంగా ఒక్కక్షణం కూర్చోలేని గడ్డు పరిస్థితిని అనుభవిస్తున్నారు. ఆహార్యంలో గంభీరాన్ని, ముఖంపై చిరునవ్వును పూసుకొని తిరిగేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ పార్టీ అతి ముఖ్యుల్లో ఒకరైన వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. పార్టీ నియమించిన సమన్వయకర్తలు ఇప్పటికే సీటు తమదేననుకొని ప్రమాణ స్వీకారానికి ఇక ఓట్లు రాబట్టుకోవడమే తరువాయి అనే భ్రమలో నియోజకవర్గాల్లోని ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో బిజీ అయిపోయారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్‌కి మంత్రి వేణును సమన్వయకర్తగా ప్రకటించారు. ఆయన దానిని బదిలీ అనుకొని నియోజకవర్గంలో సంబురంగా తిరిగేస్తున్నారు. అలాగే గూడూరి శ్రీనివాస్ 'ఎంపీ' సీటు దక్కేసిందనే ఊహలో అసెంబ్లీ సెగ్మెంట్లలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను కలిసి మద్దతుపై 'లెక్క'లేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం సిట్టింగ్ ఎంపీ భరత్‌ని సిటీ ఇన్‌చార్జిగా నియమించడంతో సిటీ సీటు తనదేనని 'జీవించేస్తున్నారు'. ఈ నేపథ్యంలో అభ్యర్థులుగా స్వీయ ప్రకటితంగా చలామణీ అవుతున్న వైసీపీ ఇన్‌చార్జులు, సమన్వయకర్తలు, సిట్టింగుల్లో సీట్ల కింద దుమారం రేగేలా వైవీ సుబ్బారెడ్డి బాంబు పేల్చారు. 'తూచ్.. వాళ్ల అభ్యర్థులు కాదు.. సమన్వయకర్తలే' అని మెలికపెట్టారు. ఫైనల్ లిస్టు తర్వాతే అభ్యర్థులు అని స్పష్టం చేశారు. అంతే ఇప్పటి వరకూ వెలువరించిన ఏడు జాబితాలూ ముక్కున వేలేసుకోక తప్పలేదు. దీంతో తామంటే తామే బరిలో అనుకుంటున్న వాళ్ల గుండెలు ఒక్కసారిగా బరువెక్కాయి. అందరూ గప్‌చుప్‌గా ఉన్నా 'చిప్పు'లు సరిగా పనిచేయని పరిస్థితి ఉందనే చర్చ నడుస్తోంది.

అభ్యర్థులు కాదు.. కేవలం ఇన్‌చార్జిలే..

వైసీపీ ఇప్పటి వరకూ ఏడు జాబితాలు ప్రకటించింది. అయితే, అవన్నీ మారొచ్చు అనే సంకేతాలను వైవీ సుబ్బారెడ్డి తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. "సిద్ధం నాలుగో సభ కంప్లీట్ అయ్యాక మేనిఫెస్టో, లిస్టు రెండూ కూడా ఒకటి రెండు రోజుల తేడాతో రిలీజ్ చేసే కార్యక్రమం జరుగుతుంది.. ఇప్పటి వరకూ మేం మార్పులు చేర్పులు చేసినా వాళ్ల 'సమన్వయకర్తలే'..ఒక్కసారి లిస్ట్ అనౌన్స్ చేశాక తప్ప కుండా అభ్యర్థులుగా మారతారు." అంటూ జగన్ జమానాలో అలవాటుగా మారిన తీరుతో మడమ తిప్పేశారు. నాలుగో సిద్ధం సభ(చివరిది) మేదరి మెట్లలో వచ్చే నెల మూడున జరగనుందని సమాచారం. ఆ రోజున లేదా ఆ తర్వాత ఒకటి రెండు రోజుల తర్వాత ఫైనల్ జాబితా పేరుతో వైసీపీ నాయ కుల రాజకీయ భవిత్యం తేల నుంది. అయితే అప్పుడు ఎని మిదో జాబితా వెలువరించి.. ఫైనల్ తర్వాత అంటారేమోననే సందేహం కూడా చక్కర్లు కొడుతోంది. దీంతో ఎవరు సీటుకు ఎసరు పెట్టారో తెలియని గందరగోళంతో వైసీపీ నాయ కులు ఒత్తిడిలో పడిపోయారు. అయితే.. ఈ ప్రకటన వెనుక మరో మైండ్‌గేమ్ ఉందనే వాదనా వినవస్తోంది. ముందు నుంచీ పార్టీలో ఉన్నా అకస్మాత్తుగా ఎవరినో తీసుకొచ్చి అప్పటి వరకూ సేవ చేసిన వాళ్లను పక్కకు పొమ్మనడం తదితర కారణాలతో ఆ పార్టీ నాయకులు విసిగిపోయారు.వాళ్లను మళ్లీ మభ్యపెట్టడానికే సుబ్బారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారనే వాదనా ఉంది.

"ఆంధ్రజ్యోతి' 'అంతర్మథనం' నిజమే..

జిల్లాలో ఎంపీ మార్గాని భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తప్పించి అర్బన్ కోఆర్డినేటర్‌గా, మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురం నుంచి తప్పించి రూరల్ కోఆర్డినేటరుగా, మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి తప్పించి గోపాలపురం సమన్వయకర్తగా, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును అక్కడ నుంచి తప్పించి కొవ్వూరు సమన్వయకర్తగా, రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డా. గూడూరి శ్రీనివాస్‌ను లోక్‌సభ కోఆర్డినేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. వీరంతా తామే అభ్యర్థులమని చెప్పుకుంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఇంకా కోఆర్డినేటర్ పదవి కూడా దక్కని నిడదవోలు, రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేల్లో కూడా ఆందోళన మొదలైంది. కేడర్ కూడా ఆందోళనకు గురవుతోంది. కోఆర్డినేటర్లు అభ్యర్థులు కాకపోతే వీరి స్థానంలో ఎవరొస్తారో, ఎవరుంటారో తెలియక క్యాడర్ అయోమయంలో పడింది. వైసీపీలో ఈ గందరగోళంతో నాయకులు పడుతున్న ఆవేదనను 'అంతర్మథనం' శీర్షికతో ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. జగన్ స్థిమితం లేని నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుంటే ఎమ్మెల్యేగా నామినేషన్ సమర్పించే వరకూ అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్నా వారిలో అయోమయం అలాగే ఉందని, బీఫాం చేతికి వచ్చాక గానీ అభ్యర్థిత్వం ఖరారు కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో 'ఆంధ్రజ్యోతి' చెప్పింది అక్షర సత్యమని రుజువైంది.

కనిపించడం లేదా! అక్రమం!



- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తే కారణం
- మరో పక్క రాజకీయ ఒత్తిళ్లు
- ఏడాదిగా పట్టించుకోని వైనం
- భయపడని భవన యజమానులు

సామాన్యుడు బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న షాపు నిర్మాణం చేస్తేనే రూల్స్ బ్రేక్ చేశారని దయలేకుండా కూల్చి వేసే అధికారులకు... నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన పెద్దల కట్టడాలు కనిపించకపోవడం శోచనీయం. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించి మళ్లీ కూల్చివేత ప్రారంభిస్తారా లేక మళ్లీ పాత పాటే పాడుతారో వేచి చూడాలి. అక్రమ కట్టడాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తుంది.

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25 : జిల్లాలో అక్రమ కట్టడాలు పాలకులు.. అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. అక్రమంగా కట్టడాలు కట్టేస్తున్న యాజమాన్యాలు అటుపై సంబంధింత అధికారులు తనిఖీలకు రాకుండా తాయిలాలు ముట్టచెబుతున్నారు. పెద్ద ఎత్తున లక్షల్లో నగదు చేతులు మారుతుందనడానికి చర్యలు లేకపోవడమే నిదర్శనం. రాజకీయ ఒత్తిడితో మరి తమ కట్టడాల వైపు చూడకుండా చేసుకునే పరిస్థితులు రాజమహేంద్రవరంలో అక్రమార్కులకు ఉన్నాయి. అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తాం.. అది చేస్తాం.. ఇది చేస్తాం అని రెండు రోజులు హడావుడి చేసి అటుపై నిమ్మకుంటున్నారు.రాజమహేంద్రవరంలో అక్రమ కట్టడాలు చాలా ఉన్నాయి. అయినా వాటివైపు కన్నెత్తి చూడడం లేదు.

160 కట్టడాలకు నోటీసులు

రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలు 160 ఉన్నట్టు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. మరి 160 కట్టడాలు కట్టే వరకు ఈ అధికారులు ఏమి చేశారో అర్థం కాని పరిస్థితి ఉంది.గతేడాదే 160 కట్టడాలను గుర్తించి కమిషనర్ నోటీసులు కూడా ఇచ్చేశారు. అంతే వాటిలో కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయి వాటిని మినహాయిస్తే మిగిలిన వాటి పరిస్థితి ఏంటో ఇంత వరకు వాటిని ఎందుకు టచ్ చేయలేదో అర్థంకాని పరిస్థితి. అక్రమ కట్టడాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలిసి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఏదైనా అక్రమ కట్టడాలపై అడిగితే ఎన్నికల నిర్వహణ శిక్షణలో ఉన్నట్టుగా అధికారుల నుంచి సమాధానాలు వస్తున్నాయి.ఇప్పుడు ఎన్నికల శిక్షణలో ఉన్నారు సరే గతేడాది కాలం గా ఏమిచేశారో వారికే తెలియాలి.వీరి నిర్లక్ష్యం అక్రమ కట్టడాల నిర్వాహకులకు ధైర్యం పెంచుతోంది.రాజమహేంద్రవర నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు గడేడాది ఏప్రిల్ నెలలో నగరంలో అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించారు. నగరంలో గెయిల్ ఆఫీసు రోడ్డు, ఇన్నీసుపేట, మెరకవీధి, మహావీర్ స్ట్రీట్ తదితర ప్రాం తాల్లో సుమారు 30 అక్రమ కట్టడాల శ్లాబులను కట్ చేశారు. అంతే మళ్లీ ఏమైందో నోటీసులు ఇస్తున్నామని వదిలేశారు. ఇప్పుడు ఎన్నికల శిక్షణ పేరుతో వాటిని పక్కన పెట్టేశారు. గతంలో నగరంలో జరిగిన అక్రమ నిర్మాణాల్లో ఎంపీ భరత్ రామ్ అనుచరుల ఒత్తిడి వల్ల కొన్ని అక్రమ కట్టడాలను అధికారులు టచ్ చేయలేదు.ఆ తరువాత చాలా నిర్మాణాలు యథేచ్ఛగానే కట్టేశారు. కొం దరు అధికారులు ఆయా భవనాల దరిదాపులోకి వెళ్ళకుండా రాజకీయ ఒత్తిళ్ల పని చేశాయి. దానవాయిపేట,గాంధీపురం,మెయిన్ రోడ్డు, జెండా పంజా రోడ్డు తది తర ప్రాంతాల్లో అక్రమ కట్ట డాలు ఉన్నాయి.అయ్యా అధికారులు ఒకసారి అటు చూడండి.. అక్రమాల పనిపట్టండి.





గతేడాది జరిగిన అక్రమ కట్టడాల కూల్చివేత(ఫైల్)

కొందరిలో చిగురిస్తున్న ఆశలు

వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో ఇప్పటికే తమదే స్థానమంటూ చలామణీ అవుతున్న వాళ్లకు దడ పుట్టగా.. కొందరిలో ఆశ మళ్లీ చిగురిస్తోంది. సీటు కోసం మళ్లీ 'ప్రయత్నాలు' మొదలు పెట్టారని తెలుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్‌లో చందన నాగేశ్వర్ ముందు నుంచీ వైసీపీలో చురుగ్గా ఉన్నారు. తనకంటూ ఓ కేడర్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆయనను రక్కున పక్కన పెట్టేసి వేణును తీసుకొచ్చారు. దీంతో ఆయన తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. పైకి పార్టీలో తిరుగుతున్నా ఆయన వర్గంలో అంతర్లీనంగా చాలా ఆవేదన ఉందని సమాచారం. రాజమహేంద్రవరం ఎంపీ సీటు తనదేనని అనసూరి పద్మలత ముందు నుంచీ ఆశ పెట్టుకున్నారు. అయితే పార్టీలో చురుగ్గా తిరుగుతున్న ఆమెను కాదని చివరికి అదే సామాజిక వర్గానికి చెందిన గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చారు. వైసీపీ పెద్దలను నమ్మిన అనసూరికి నిరాశే మిగిలింది. హోం మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించి, అక్కడున్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు.తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన అంతరంగికుల వద్ద వాపోతున్నట్టు చెబుతున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చినా అయనలోనూ అదే అసహనం ఉందట. ఈ నేప థ్యంలో మళ్లీ 'కోరుకున్న' మార్పు జరుగుతుందా? అనే ఆశలో ఆశావహులు ఉన్నారు.

ఎంపీ భరత్‌పై అసత్య ప్రచారమని కార్యకర్త ఫిర్యాదు

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎంపీ భరత్‌పై సోషల్ మీడియాలో, కరపత్రాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ వైసీపీ కార్యకర్త లక్ష్మణ్ కుమార్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎంపీ భరత్ రామ్ బీజేపీతో మంతనాల్లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'భరత్ లవ్ 25% కమీషన్.. ఇసుక అక్రమ రవాణా, ప్రభుత్వ కాంట్రాక్టు, ఈట్ స్ట్రీట్, మాదక ద్రవ్యాల ఎగుమతి, గ్రావెల్,గ్రానైట్, ఆవభూములు, కంబాల చెరువు, సుబ్రహ్మణ్య మైదానం పనుల్లో 25 శాతం కమీషన్.. పనేదైనా.. పర్సంటేజీ చెల్లించాల్సిందే.. 25% కమీషన్ భారత్‌పే రేట్ కార్డ్' అంటూ కరపత్రాలు ముద్రించి పంచిపెడుతున్నారన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కరపత్రాలపై రగడ పది రోజుల నుంచీ నలుగుతోంది.ఎంపీ భరత్ పోలీసులపై తీవ్ర ఒత్తిడి తెస్తు న్నారు. కరపత్రాలు ముద్రించి పంచిపెడుతున్నది ఎవరో తెలియాలని పోలీసులను ఎంపీ భరత్ ఈ నెల 16న ఆదేశించారు.దీంతో పోలీసులు అదే పనిలో ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షకు 15,709 మంది హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. 18501 మంది అభ్యర్థులకు 15,709 మంది 84.91 శాతం హాజరయ్యారని తెలిపారు. రాజమండ్రి డివిజన్‌లో 35, కొవ్వూరు డివిజన్‌లో 18 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదన్నారు. కలెక్టర్ మాధవీల, జేసీ తేజ్ భరత్, డీఆర్వో నరసింహులు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అంతకుముందు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరీక్షా గదిలోకి అనుమతించారు.



తాళ్లపూడిలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల క్యూ.. రాజానగరంలో పరిశీలిస్తున్న జేసీ

వైభవంగా లక్ష్మీనరసింహుని తెప్పోత్సవం



పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ముగిసిన అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు
- చివరి రోజు హంస వాహనంపై విహరించిన స్వామివారు
- ఘనంగా శ్రీపుష్పోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 25: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం స్వామివారిని పుష్పక వాహనంపై ఊరేగించారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి అనంతరం దేవస్థానం చెరువుగట్టు వద్దకు తీసుకువచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చెరువులో ఉన్న హంస వాహనంపై కొలువుదీర్చి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెప్పోత్సవ నిర్వహణ విరాళ దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ ఛైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజా బహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి తిరుమంజనములు, దర్పణ సేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీ పుష్పయాగోత్సవం, చెంగోళ విన్నపం, తీర్థగోష్ఠి నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



పుష్పోత్సవం నిర్వహించిన దృశ్యం

ఘనంగా శ్రీపుష్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన స్వామివారి శ్రీపుష్పోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ తిరువరాధన పూజా కార్య క్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో స్వామివారికి ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, అనంతరం శ్రీస్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్య నారాయణ, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం

భీమేశ్వర స్వామివారి తెప్పోత్సవం





ద్రాక్షారామ, ఫిబ్రవరి 6: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భీమేశ్వర స్వామి వారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి 7.05 గంటలకు కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వార్లను మంగళ వాయిద్యాల నడుమ సప్తగోదావరిలో విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకృతమైన హంస వాహనం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం కల్యాణమూర్తులను హంసవాహనంపై కల్యాణ బ్రహ్మలు అధిష్ఠింపజేశారు. వేద పండితులు బులుసు రామకృష్ణ బృందం ముందుగా స్వామివారికి ఆస్థాన పూజ జరిపారు. అనంతరం కల్యాణ మూర్తులకు నీరాజన మంత్ర పుష్పములు సమర్పిస్తుండగా మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారు సప్తగోదావరి నదిలో జలవిహారం చేశారు. భీమేశ్వరుని జలవిహారం సప్తగోదావరి ఒడ్డుకు చేరుకోగా భక్తులు తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని రథోత్సవం



అన్నవరం, ఫిబ్రవరి 25: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మాఘపు ఆదివారం పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. అయితే ప్రతి ఆదివారం రథోత్సవం నిర్వహించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దీనిన ఆర్జిత సేవగా పెట్టాలని భావిస్తున్నారు. వచ్చే నెలలో జరిగే పాలక మండలి సమావేశంలో దీనిపై చర్చించి దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో తుది చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

భావనారాయణస్వామి ఆలయం కిటకిట

మాఘ ఆదివారం కావడంతో పోటెత్తిన భక్తజనం



ఆలయంలో పాలపొంగులు సమర్పిస్తున్న భక్తులు



ఆలయానికి పోటెత్తిన భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మాఘమాస తిరునాళ్లు వైభవోపేతంగా సాగుతున్నాయి. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా మూడో ఆదివారంతో పాటు భావనారాయణస్వామి జన్మదినం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల తాకిడిని దృష్టిని ఉంచుకుని ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి, స్వామివారిని మేలుకొల్పిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఆలయ ప్రాంగణంలో ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాన్నం, పాలపొంగులు తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. స్వామివారి జన్మదినం కావడంతో తిరునాళ్లలో సుమారు 45 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో భీమశంకరరావు తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు స్వామివారిని దర్శించుకుని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చక్రధర్, వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

లోవలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, ఫిబ్రవరి 25: తలుపులమ్మ లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే భక్తులు తరలివచ్చారు. లోవకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన షెడ్‌లతో పాటు వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తుల రద్దీని పర్యవేక్షించారు. వివిధ విభాగాల ద్వారా రూ.3.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హోరాహోరీగా..

సామర్లకోటలో ఖోఖో పోటీలు



ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో 56వ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య ఆదివారం హోరాహోరీగా జరిగాయి. ఖోఖో పోటీల నిర్వాహకులు కె.పట్టాభిరామం, ఊబా జాన్ మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విశాఖ=గుంటూరు మధ్య జరిగిన పోటీలలో 10-3 స్కోరు తేడాతో విశాఖ విజయం సాధించింది. కృష్ణా-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో 9-1 స్కోర్ తేడాతో కృష్ణా జట్టు విజయం సాధించింది. ప్రకాశం-కర్నూలు మధ్య జరిగిన పోటీలో 15-3 పాయింట్ల తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా-పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి జట్టు 5-3 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కడప- అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీలో కడప జట్టు విజయం సాధించింది. విశాఖ-నెల్లూరు మధ్య జరిగిన పోటీలో నెల్లూరు జట్టు 5-9 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కృష్ణా- చిత్తూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణ జట్టు 11-4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ప్రకాశం-విజయనగరం జట్ల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం జట్టు 13-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలను తిలకించేందుకు ప్రముఖులు, పలువురు క్రీడాకారులు హాజరయ్యారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ పోటీలు



స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా నిలిచిన శ్రేయకు ట్రోఫీ బహూకరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: అమలాపురం 2వ వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్-2024 పోటీలు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబుల నేతృత్వంలో జరిగాయి. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా ఎం.శ్రేయ(తణుకు), స్ట్రాంగ్ ఉమెన్స్ రన్నర్‌గా పి.వందన(అమలాపురం)లు నిలిచారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. పవర్‌లిఫ్టింగ్ బార్‌ను ఎత్తి పోటీలు ప్రారంభించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 96 మంది వెయిట్ లిఫ్టర్లు హాజరయ్యారు. 9 విభాగాల్లో పోటీలు జరిగాయి. తొలుత మహిళా విభాగంలో నిర్వహించిన పోటీల విజేతల వివరాలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ప్రకటించారు. 66 కిలోల మహిళా విభాగంలో జి.సుభద్ర (మలికిపురం) ప్రథమ, యు.శశికళ (అమలాపురం) ద్వితీయ, ఎం.దుర్గ (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోలు పైబడిన విభాగంలో ఎం.శ్రేయ (తణుకు), పి.వందన (అమలాపురం), సీహెచ్ హారిక (రామచంద్రపురం) వరుస స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డీవీవీ సత్యనారాయణ, యు.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం(అమలాపురం) వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, డాక్టర్ గంధం విశ్వనాథ్, కౌన్సిలర్లు ఆశెట్టి నాగదుర్గ, యేడిద శ్రీను, కల్వకొలను బాబి, ఆశెట్టి ఆదిబాబు, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెండూరి నాగేశ్వరరావు, తరెట్ల రాజేష్ తదితరులు విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్సీ కవిత



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: ముంగండ శ్రీముత్యాలమ్మవారి దయతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ప్రగతిపథంలో ముందుకు సాగే విధంగా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. కవితకు నన్నయ యునివర్సిటీ న్యాయాధికారి నండెపు నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మీతో కలిసి పూజలు నిర్వహించారు. అదే విధంగా అయినవిల్లి విఘ్నేశ్వరుడు, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాలు, ప్రసాదాలను కవితకు అందించారు. అప్పనపల్లి దేవస్థానం ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు కొమ్మల సూరిబాబు అప్పనపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందించారు. ఆలయ అర్చకులు సోమయాజులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కమిటీతో నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు స్వీకరించగా గడువు ముగిసే సమయానికి తొమ్మిది పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లా సంఘ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడిగా సవరపు చినపాపారావు (కరప ఎంఆర్‌వో ఆఫీస్), సహాధ్యక్షుడిగా వాసంశెట్టి దుర్గాప్రసాద్(కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్), ఉపాధ్యక్షులుగా ధర్మవరపు శ్రీనివాసరావు (అమలాపురం సివిల్ సప్లయిస్ ఆఫీస్), బాలిబోయిన గణేశ్వరరావు (పెద్దాపురం ఆర్‌డీవో ఆఫీస్), కార్యదర్శిగా ఖండవల్లి చంద్రశేఖర్ (మామిడికుదురు బాయ్స్ హాస్టల్), సంయుక్త కార్యదర్శులుగా మానుపాటి వరలక్ష్మి (అమలాపురం ఆర్‌డీవో ఆఫీసు), తోటకూర శ్రీనివాస్ (రామచంద్రపురం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొరవాడ దుర్గాప్రసాద్ (కాకినాడ ఎంప్లాయిమెంట్ ఆఫీస్), కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ (కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారం నూతనంగా ఎన్నికైన కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ పితాని త్రినాథరావు, కార్యదర్శి ఎస్ఎస్‌కే దుర్గాప్రసాద్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యవర్గం మూడేళ్ల కాలం పాటు కొనసాగుతుందని సంఘం ప్రతినిధులు తెలిపారు.

సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధికి నేడు శ్రీకారం



సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రూ.25.37 కోట్లతో చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టనున్న అమృత్‌భారత్ స్టేషన్ పథకం పనులను జాతికి అంకితం చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్‌లో పథకంలో సామర్లకోట రైల్వే స్టేషన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఈ నిధులతో సామర్లకోట స్టేషన్ ప్లాట్‌ఫాం విస్తరణ, అభివృద్ధి, ప్లాట్‌ఫాంల సుందరీకరణ పనులు, టాయిలెట్స్ అభి వృద్ధి పనులు, వెయిటింగ్ హాలు అభివృద్ధి, రెండో ఎస్కలేటర్, స్టేషన్ విద్యుదీకరణ, స్టేషన్ ఆవరణ బ్యూటిఫికేషన్ పనులను చేపట్టనున్నట్లు సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు రానున్న కొత్త కళ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైల్వే స్టేషనుగా రాజమండ్రి రైల్వే స్టేషను మెరుగుపడనుంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం దేశ వ్యాప్తంగా ఎంపికైన స్టేషన్ల కోసం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని సామర్లకోట, అనపర్తి, రాజమండ్రి ఉన్నాయి. ప్రజలు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని తిలకించడానికి వీలుగా రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్క్రీన్లు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలకు వేదిక తదితర ఏర్పాట్లను ఒకటో ప్లాట్‌ఫాం చివరన రైల్వే అధికారులు పూర్తి చేశారు. నిబంధనలను అనుసరించి ఇప్పటికే ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వి.కల్యాణ్‌కుమార్‌ని రైల్వే నియమించింది. ఉదయం 10.30 గంటల నుంచే వివిధ కార్యక్రమాలు ప్రారంభం కాగా 12.30 గంటల సమయంలో ప్రధాని వర్చువల్ విధానంలో శంకుస్థాపన నిర్వహిస్తారు. అమృత్ భారత్ స్టేషన్‌గా చేసే అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు ఉన్న రైల్వే స్టేషను రూపు రేఖలను రూ.214 కోట్లతో పూర్తిగా మార్చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పిస్తారు. అయితే ప్రయాణికుల రాకపోకల రీత్యా కీలకమైన ఆరో ప్లాట్‌ఫాం నిర్మాణంపై స్పష్టత లేదు. అలాగే ఇదే కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరిలోని లక్ష్మీపురం-ఎన్‌హెచ్ 16 (తుని రైల్వేస్టేషను సమీపంలో), మాధాపురం-పిఠాపురం, గోర్స-పిఠాపురం (పిఠాపురం), చేపూరు-ఎన్‌హెచ్16 (హంసవరం), కాల్దరి-వేలివెన్ను, వేలివెన్ను-శెట్టిపేట(కాల్దరి), శెట్టిపేట గ్రామంలో(నిడదవోలు)ని రైల్ అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా ప్రధాని మోదీ జాతికి అంకితం చేస్తారు.

హాకీ మహిళా జట్టు ఎంపిక




ఎంపికైన జట్టు సభ్యులు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 25; మార్చి 8 నుంచి 19 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగే అంతర్ జిల్లాల మహిళా హాకీ పోటీలకు ఆదివారం ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక జిల్లా క్రీడా మైదానంలో జరిగింది. 32మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు వి.రవిరాజు, నాగేంద్రకుమార్, సభ్యులు రాజారమేష్, కిరణ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

నామమాత్రంగానే విద్యుదుత్పత్తి



మోతుగూడెం,ఫిబ్రవరి 25: సీలేరు కాంప్లెక్స్ పరిధిలో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అంతంత మాత్రంగానే జరుగుతోంది. గోదావరి డెల్టాకు రబీ పంటలకు మార్చి, ఏప్రిల్ నెలల్లో అవసరమైన నీటిని సీలేరు నుంచి సరఫరా చేసే నేపథ్యంతో పాటు వేసవిలో రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ ఉత్పత్తిని అందించే క్రమంలో ఈ నెల పది నుంచి ఎగువ సీలేరు, దిగువ సీలేరు, డొంకరాయి మూడు జల విద్యుత్ కేంద్రాల్లో 725 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేసి డొంకరాయి జలాశయంలో నీటిని నిల్వ చేసేందుకు జెన్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్ పరిధిలోని మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లు ఉండగా, ఇందులో 2, 5 నంబర్లు గల రెండు యూనిట్లలో ఆర్ఎల్ఏ స్టడీ పేరిట కొన్ని నెలలుగా విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. అలాగే నాలుగో నంబర్ యూనిట్‌లో ఇటీవలే సాంకేతిక సమస్య రావడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. రెండు రోజుల క్రితం జల విద్యుత్ కేంద్రంలో ఆరో నంబర్ యూనిట్‌కు సంబంధించి కూలర్స్‌లో సాంకేతిక సమస్యతో ఆ యూనిట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారు. దీంతో మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లలో రెండు యూనిట్లు (1,3) మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ రెండు యూనిట్ల ద్వారా కేవలం ఒక మిలియన్ యూనిట్లు పైచిలుకు మాత్రమే ఉత్పత్తిని చేస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడంతో జలవిద్యుత్ ద్వారా ఒక మిలియన్ యూనిట్ పైగా మాత్రమే ఉత్పత్తి అవుతోంది. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడానికి సీలేరు కాంప్లెక్స్‌లోని జలవిద్యుత్ కేంద్రాలు ఏడాది పొడవునా పనిచేస్తాయి. మాచ్‌ఖండ్, ఎగువ సీలేరు, దిగువ సీలేరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాలు స్థాపించి ఐదున్నర దశాబ్దాలు కావడంతో తరచూ యూనిట్లలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ప్రస్తుతం గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి అవసరాలకు బలిమెల నుంచి రాష్ట్ర వాటాగా తీసుకునే నీటిని కూడా జెన్‌కో అధికారులు నిలుపుదల చేశారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో బలిమెలలో ఆంధ్రా వాటా, డొంకరాయి జలాశయంలో ఉన్న నీటి నిల్వలతో కలిసి 32.52 టీఎంసీలు ఉన్నాయి.

టీడీపీలో చేరికలు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ఎటపాక, ఫిబ్రవరి 25: ఎన్నికల వేళ టీడీపీలో చేరికలు మొదలయ్యాయి. ఆదివారం ఎటపాక మండలం, కన్నాయిగూడెం పంచాయతీ పరిధిలోని కొండగట్టు ఆదివాసీ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్ వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడారు. ఏజెన్సీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని చెప్పారు. ఆదివాసీ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు బండారు భద్రరావు, కొండగట్టు గ్రామ కుంజం పటేల్, సూరిశెట్టి సత్యనారాయణ, ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్, పసుపులేటి రాంబాబు పాల్గొన్నారు.

పోలీసుల మైత్రి సదస్సు

మోతుగూడెం, ఫిబ్రవరి 25: మోతుగూడెం పరిధిలో ఉన్న మల్లవరం గ్రామంలో ఆదివారం మోతుగూడెం పోలీసులు మైత్రి సదస్సు నిర్వహించారు. సదస్సుకు వచ్చిన గిరిజనులకు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు చేతబడులు, గంజాయిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పిల్లలను పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అధికారులతో మాట్లాడి విద్యుత్, తాగునీటి సదుపాయం కల్పిస్తామని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రాజు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడవిరాజులు బాబు పండుగ



అడవిలో పండుగ చేసుకుంటున్న జనం

వై.రామవరం, ఫిబ్రవరి 25: మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో అడవిరాజులుబాబు పండుగలు గిరిజనులు, గిరిజనేతరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని మామిడిచెట్ల కింద రాజులుబాబుకు వెదురుబద్దలతో బాణాలు తయారుచేసి వడపప్పు, కోడిగుండె కాయలను నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వై.రామవరం, చవిటిదిబ్బలు, బండిగడ్డ, సింగవరం, దదిలికివాడ తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఈ పండుగలు జరుపుకున్నారు. కొండకోనల్లో జీవనాధారం కోసం సంచరించే తమకు ఎటువంటి ఆపదలు ఎదురుకాకుండా చూడాలంటూ రాజులుబాబును మొక్కుకున్నారు. కోడి మాంసాలతో సహపంక్తి భోజనాలు చేశారు.

'బాబు ష్యూరిటీ' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

దేవీపట్నం, ఫిబ్రవరి 25: కచ్చులూరు కాలనీ (ఇందుకూరు-2) ఆర్ అండ్ ఆర్‌కాలనీలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు జేఎస్ నగేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ల చంటిబాబు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మచ్చు నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మచ్చు త్రిమూర్తులు, తెలుగు యువత అధ్యక్షుడు లంక హరిబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు పళ్లపాటి నాగేశ్వరరావు, నేరం బేబి, కొనుతల రాములు, తోకల పొట్టియ్య, కర్రి రాజీవ్, పుట్టపల్లి మల్లేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

పాపికొండలకు ఆరు బోట్లు

దేవీపట్నం, ఫిబ్రవరి 25: రాష్ట్ర నలుమూలల నుంచి పాపికొండలకు పోశమ్మ గండి బోటు పాయింట్ నుంచి ఆదివారం ఆరు పర్యాటకు బోట్లు బయలుదేరి వెళ్లాయి. గోదావరి పరీవాహక ప్రాంతాలైన దేవీపట్నం, కొండమొదలు, పూడిపల్లి తదితర గ్రామాల మీదుగా పాపికొండల అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు ఆదివారం 350 మంది వరకు వెళ్లారు.

శ్రీనివాసరావుకు అక్కినేని అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25: జిత్ మోహన్ మిత్రా కళావేదికలో అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి సంవత్సరం సందర్భంగా నెలవారీ సభలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుక్కురెడ్డి శ్రీనివాసరావును అక్కినేని పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు వెంకటేశ్వరరావు, ముద్రగడ సోమరాజునాయుడు, శేషగిరిరావు, అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.

కాపులకు న్యాయం చేసింది టీడీపీనే

- వైసీపీ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయం
- కాపు,తూర్పుకాపు సమావేశంలో టీడీపీ-జనసేన నేతలు



సమైక్య అభివాదం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25: కాపులకు, తూర్పుకాపులకు న్యాయం చేసింది టీడీపీయేనని ఆ పార్టీ ముఖ్యనేతలు అన్నారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన కాపు, తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. కాపులు, తూర్పుకాపుల సంక్షేమానికి ఆనాడు చంద్రబాబు కాపు కార్పొరేషన్ పెట్టి భారీగా నిధులు కేటాయించారని, విద్యార్థులకు విదేశీ విద్యనందించారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక కాపులను దగా చేశాడని మండిపడ్డారు. గెలుపు సంగతి తర్వాత ముందు సీటు తెచ్చుకో అని పదేపదే వ్యాఖ్యానించిన భరత్‌కు చెబుతున్నా నాకు సీటు ఖరారైంది.. నీకు సీటు ఇరిగిపోతుంది చూసుకో అని అన్నారు. రాజమహేంద్రవరంలో గంజాయి బ్యాచ్‌లు, బ్లేడుబ్యాచ్‌లను పెంచి పోషించిన వారికి చెబుతున్నాం టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చాక ఉక్కుపాదంతో తొక్కేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తన కుమారుడు వాసును ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన ఇన్ చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ కాపులను చాలా చులకనగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. రాజమహేంద్రవరం బాగుపడాలంటే భరత్‌కు డిపాజిట్లు రాకుండా చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి మాట్లాడుతూ ఆదిరెడ్డి వాసును అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను, దొండపాటి సత్యంబాబు, మజ్జి రాంబాబు, నల్లం శ్రీను, రెడ్డి మణి, గంటా స్వరూప, ప్రియసౌజన్య, జామి సత్యనారాయణ, మాలే విజయలక్ష్మి, వర్రే శ్రీనివాసరావు, వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ఐక్యతతో అనపర్తిలో విజయం సాధిస్తాం



బలభద్రపురం సభలో ఐక్యత చాటుతున్న రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు

- టీడీపీ-జనసేన ఐక్యత సభలో ఇరు పార్టీల నాయకులు

బిక్కవోలు, ఫిబ్రవరి 25: ఐక్యతతో అనపర్తిలో విజయం సాధిస్తామని టీడీపీ జనసేన పార్టీల నాయకులు అన్నారు. అనపర్తి నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సందర్భంగా మండలంలోని బలభద్రపురంలో ఆయన అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తల సమావేశంలో ఇరు పార్టీల నాయకులు ప్రసంగించారు. రామకృష్ణారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాక్షస పాలనను అంతమొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తమలాగే నియోజకవర్గంలోని ఇరు పార్టీల కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ముందు నుంచి శ్రీనివాసరావు సహకారం అందించడం అభినందనీయమని, జనసేనలో ఉండి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు రానున్న ఉమ్మడి ప్రభుత్వంలో సముచిత స్థానం లభిస్తుంద న్నారు. నియోజకవర్గంలో వైసీపీ పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి భగ్నం చేయాలన్నారు. ఈ సందర్భంగా హర్షధ్వానాల మధ్య ఇరు పార్టీల నాయకులు ఐక్యతను చాటారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, అళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, రావాడ నాగు, వీరబాబు, వీరాస్వామి, సత్తిబాబు, ప్రసాదరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

బలభద్రపురం సభకు భారీ బైక్ ర్యాలీ

అనపర్తి, ఫిబ్రవరి 25: బిక్కవోలు మండలం బలభద్రపురంలో టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రామవరంలోని ఆయన స్వగృహం నుంచి బైక్ ర్యాలీతో వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కారు నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ పాల్గొన్నారు. సుమారు 500 మోటారుసైకిళ్లతో పొలమూరు, చినపొలమూరు, సావరం, అనపర్తి పాతవూరు, కెనాల్ రోడ్డు మీదుగా మెయిన్‌రోడ్డు, గాంధీబొమ్మ, రైల్వేస్టేషన్ మీదుగా తిరిగి కెనాల్ రోడ్డు మీదుగా కొత్తూరు, లక్ష్మీనరసాపురం మీదుగా బలభద్రపురం చేరుకుంది.

ప్రశాంతంగా గ్రూప్-2

- రాజానగరంలో 6 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు
- 3,454 మంది హాజరు.. 437 మంది గైర్హాజరు



పరీక్షా కేంద్రం వద్ద నోటీసు బోర్డులో వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు

రాజానగరం, ఫిబ్రవరి 25: రాజానగరం మండలంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఏర్పాటు చేసిన 6 పరీక్షా కేంద్రాల్లో 3,992 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3,454మంది రాశారు. 437 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30వరకు జరిగిన ఈ పరీక్షలకు మండలంలోని తూర్పుగోన గూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 1,000 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 866మంది హాజరైనట్టు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 600మందికి 524మంది హాజరైనట్టు డిప్యూటీ తహశీల్దార్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. కానవరంలోని గాయత్రి విద్యాసంస్థలో 400 మందికి గాను 340 హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.దేవిబంగారం తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రంలో 228 మందికి గాను 195మంది పరీక్షలు రాసినట్టు ఎంపీవో కమల్‌రాజ్ తెలిపారు. భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 864 మందికిగాను 750మంది హాజరైనట్టు తహశీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 900 మందికి గాను 779మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ టి.జియేంద్రకుమార్ తెలిపారు. కాగా రాజమహేంద్రవరం జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 25: ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న సీఎం జగన్ దేనికి సిద్ధమయ్యారో స్పష్టం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రశ్నించారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని దీనికి ఏం సమాధానం చెబుతారన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఇండియా కూటమితో కొనసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

రెల్లిలకు 3శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రెల్లి కులాల సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులాలకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రెల్లి కులాల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం తాడితోట రెల్లి వీధిలో ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో వర్గీకరణ చేసినప్పుడు రెల్లి కులాల వారికి ఎ కేటగిరిలో ఒక శాతం అని, కేటగిరి 2లో రోస్టర్ విధానాల మీద రిజర్వేషన్ కల్పించిన అంశాన్ని ప్రస్తావించారు. దీని వల్ల రెల్లి కులాల వారికి నష్టం వాటిల్లిందన్నారు. దశాబ్దాలుగా రెల్లి కులాలు అత్యంత తీవ్రస్థాయిలో అవమానాలను,అసమానతలను ఎదుర్కొంటున్నాయ న్నా రు. రెల్లి కుల సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఏపీ రెల్లి కులాల ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఆవిర్భవించిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బంగారు తాతారావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, వడ్డాది సింహచలం, ముత్యాల మురళి, బంగారు నాగేశ్వరరావు, బంగారు సత్యం అప్పారావు, నిమ్మకాయల రమణమూర్తి, (విజయవాడ), ఎంఎల్ నారాయణ (విజయవాడ), యర్రంశెట్టి పోతురాజు (బాపట్ల), పొడుగు కళ్యాణ్ ,ఇసుకపల్లి వెంకటేశ్వరరావు(విశాఖపట్నం) తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పంచాయతన సూర్యారాధన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25: రాజమహేంద్రవరం పేపరుమిల్లు రోడ్డు సీతంపేటలో ఈనెల 11 నుంచి శ్రీపద్మాక్షి సేవా సమితి పక్షాన వడలి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధన ఆదివారం ఉదయం పూర్ణాహుతితో ముగిసింది. 15 రోజులుగా ప్రతీరోజు సూర్యభగవానుడికి విశేష పూజలు, అభిషేకాలు, సూర్య నమస్కారాలు, హోమాలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ ఆందోళన

గోకవరం, ఫిబ్రవరి 25: అధ్వానంగా ఉన్న గోకవరం-తంటికొండ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలంటూ ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. తంటికొండ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎంతోకాలంగా ప్రయాణయోగ్యంగా లేని ఈ రహదారిపై అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు హామీలివ్వడం తప్ప ఆచరణ శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేంకటేశ్వరస్వామి దర్శనానికి తంటికొండ వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాలని, అటువంటి రహదారి నిర్మాణానికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే తంటికొండ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సత్తి వెంకటరెడ్డి, బత్తుల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు

కుతుకులూరులో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

అనపర్తి, ఫిబ్రవరి 25: టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మూడో రోజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో అన్ని విధాల నష్టపోయిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెట్టగల నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, పులగం అచ్చిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో చికిత్స ఐవీఎఫ్ చికిత్స

హెలియోస్ లలితా ఆసుపత్రి డాక్టర్ లలితా కంభంపాటి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25: సంతానలేమితో బాధపడే వారి కోసం రాజమహేంద్రవరం హెలియోస్ హస్పటల్‌లో లలిత ఐవీఎఫ్ చికిత్స విభాగం ప్రారంభించామని నిర్వాహకులు డాక్టర్ లలిత కంభంపాటి తెలిపారు. దానవాయిపేట హెలియోస్ హాస్పటల్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు తమ ఆసుపత్రిలో ఐయుఐ సేవలు అందించామని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ ప్రమాణాలతో ఐవీఎఫ్ విభాగాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించనున్నట్టు చెప్పారు. వివాహమై ఏడాది గడచినా సంతానం లేకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సమావేశంలో డాక్టర్ కవికొండల శ్రీనివాస్, హాస్పటల్ మేనేజర్ సోమసుందరరావు తదితరులు పాల్గొన్నారు

పార్లమెంటరీ లీగల్ ఎన్నికల కమిటీ సభ్యుడిగా నీలపాల

రంగంపేట, ఫిబ్రవరి, 25 :రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం న్యాయవాదుల ఎన్నికల కమిటీ సభ్యుడిగా రంగంపేట మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులను నియమించినట్టు పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు తెలిపారు. రాబోయే ఎన్నికల సమయంలో న్యాయ సహాయం అందించేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా న్యాయవాదులతో కమిటీ నియమించామని, కమిటీ కేంద్ర కార్యాలయంలోని లీగల్ సెల్‌తో సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో పనిచేయలన్నారు. ఈ సందర్భంగా త్రిమూర్తులకు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆళ్ల గోవింద్ తదితర నాయకులు, అభినందనలు తెలిపారు.

రాజరాజేశ్వరిదేవి ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజానగరం, ఫిబ్రవరి 25: రాజానగరంలోని శివాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా తొలిరోజు అంకురార్పణ, ధ్వజారోహణం, శిఖర కలశాభిషేకం, హోమ క్రతువులను వేద పండితులు ప్రముఖ వ్యాపారవేత్త కుందుల బలరామకృష్ణ దంపతులు చేతుల మీదుగా జరిపించారు. అనంతరం మహిళా భక్తులు లలిత సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25: దానవాయిపేట సంగీత లహరి కళావేదిక పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంగీత లహరి నెలవారీ సంగీత సభ జరిగింది. వప్పు అప్పారావు, విజయలక్ష్మి దంపతుల సంస్మరణార్థం కుమారుడు సుబ్రహ్మణ్యం సత్యవతి దంపతుల సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎస్ కళ్యాణ రామన్ మృదంగం, మోదుమూడి సుధాకర్ గాత్రం, పాలపర్తి నాగేశ్వరరావు వయోలిన్‌తో కర్ణాటక గాత్ర కచేరీ సంగీతాభిమానులను అలరించింది.



మెడికో క్రికెట్ టోర్నీ విజేత 'ఆంధ్రా'

రన్నర్‌గా జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల జట్టు

రాజానగరం, ఫిబ్రవరి 25: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కళాశాల పురుషుల క్రికెట్ క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆరు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో 48 కళాశాలల నుంచి క్రీడాకారులు తలపడ్డారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు విన్నర్‌గా, రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచినట్టు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఇ.త్రిమూర్తులు ప్రకటించారు. నాకౌట్ విధానంలో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా 129పరుగులు, జీఎస్ఎల్ 117పరుగులు సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలపై రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, గుంటూరు మెడికల్ కళాశాలపై ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు విజయం సాధించినట్టు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

మోక్ష వేంకటేశ్వరుడికి వెండి నామాలు

బిక్కవోలు, ఫిబ్రవరి 25: కొంకుదురు గ్రామంలోని మోక్ష వేంకటేశ్వర స్వామికి గ్రామానికి చెందిన కర్రి క్రీస్తురెడ్డి, లలితాలక్ష్మి దంపతులు వెండి నామాలను ఆదివారం అందజేశారు. ఈ నామాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి స్వామికి అలంకరిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తేతల శ్రీనివాస రెడ్డి, కర్రి వెంకటరెడ్డి తెలిపారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఎస్పీ



కడియం, ఫిబ్రవరి 25: కడియంలోని పల్ల వెంకన్న నర్సరీని ఆదివారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ సందర్శించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను చూశారు. నర్సరీ రైతు పల్ల వినయ్ మొక్కల వివరాలు, విశిష్టత, పెంపకం గురించి వివరించారు.

కొండపై నమ్మాళ్వారుల పరంపదోత్సవం

ముగిసిన నరసింహస్వామి అధ్యయనోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి 25: చారిత్రాత్మక కోరుకొండ కొండపై ఆదివారం నమ్మాళ్వారుల పరంపదోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు నరసింహస్వామికి ఐదు రోజులపాటు జరిగిన అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా స్వయంభు లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నాళాయర ప్రబంధ పారాయణం నిర్వహించారు. అలాగే అనంత పద్మనాభ స్వామి వాహన సేవలు ముగించారు. ఈ సందర్భంగా కొండపైన ఉన్న లక్ష్మీనరసింహస్వామిని, భగవత్ రామానుజులను, నమ్మాళ్వారులను ప్రత్యేక పల్లకితో తోడ్కుకుని వచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రఘునాథ బట్టర్, ఇరగవరపు కృష్ణమాచార్యులు, మార్గపురి రాంబాబు, పెదపాటి గిరిధరాచార్యులు, పెరవళి వంశీ, గొట్టిముక్కల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రంగనాథుని అధ్యయనోత్సవాలు ప్రారంభం.. రెండు రోజులు పాటు జరిగే శ్రీ భూ సమేత రంగరాజస్వామి అధ్యయనోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా అధ్యాపక స్వాములు ఉదయం, సాయంత్రం నాలాయర ప్రబంధాన్ని పారాయణం చేశారు.



ఐసీడీఎస్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రాజు

అధికారులు, ఉద్యోగులపై చిన్నచూపు తగదు

ఐసీడీఎస్ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్రాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 25 : సంక్షేమశాఖలో అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు, ఉద్యోగులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం తగదని ఐసీడీఎస్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న చందాసత్రంలో ఆదివారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఐసీడీఎస్ అనుబంధ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని కేడర్ ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా ఒకే గొడుగు కింద పనిచేయడానికి ఈ సమావేశం నాంది పలకాలన్నారు. సూపరింటెండెంట్ పోస్టు మంజూరు చేయాలని, సూపర్‌వైజర్లను యాప్‌ల ద్వారా వేధించడం తగ్గించాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం సీడీపీవో వి.నరసమ్మ, కాంట్రాక్టు సీడీపీవో రాజశేఖర్, ఎస్‌సీ పీసీఆర్ అధికారి మునిరాజు, డీసీపీవో రాష్ట్ర నాయకులు వెంకట్రావు, సోమశంకర్ పాల్గొన్నారు.



నేడు యథావిధిగా స్పందన

రాజమహేంద్రవరం రూరల్ , ఫిబ్రవరి 25: రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. జిల్లా, డివిజన్, మునిసిపల్, మండల, సచివాలయం పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు గమనించాలన్నారు.



సీటు.. హాటు!

ఆశావహులు.. అటెన్షన్!

నిడదవోలులో మారనున్న సీన్

- నిడదవోలు నుంచి కందుల దుర్గేష్?
- రూరల్ నుంచి గోరంట్లే?
- త్వరలో అధికారిక ప్రకటన
- నిడదవోలు టీడీపీ నేతల్లో అలజడి
- మిగిలిన మూడు స్థానాల్లో తీవ్ర పోటీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీట్లు సిగపట్లు తప్పడం లేదు.. తొలిజాబితా విడుదల కావడంతో మిగిలిన నియోజకవర్గాల ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.. సోమవారమే మరో జాబితా విడుదలవుతుందనే సమాచారంతో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది..ఏ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారనేది దానిపై లెక్కల్లో మునిగితేలుతున్నారు.. టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితాలో సీట్లు సాధించిన అభ్యర్థులు ఉత్సాహంగా పోటీలో దిగగా.. ఇంకా టిక్కెట్లు కేటాయించిన నియోజకవర్గాల్లో మాత్రం తీవ్ర టెన్షన్ నెలకొంది..జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా శనివారం ప్రకటించిన జాబితాలో ముగురికి చోటిచ్చారు. ఇంకా నాలుగు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడి నుంచి ఎవరెవరు పోటీ చేస్తారనే దానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. వైసీపీలోనూ జిల్లాలో ఇంకా మూడు స్థానాలు ప్రకటించాల్సి ఉంది. దీంతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.



నిడదవోలు టిక్కెట్ దుర్గేష్‌కు ఇస్తారనే సమాచారంతో ఇంటికి చేరిన కార్యకర్తలను సముదాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఏం జరుగుతోంది..

రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ పట్టుపట్టి కూర్చున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ సీటు గ్యారంటీ అని చెప్పిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తొలి జాబితాలో మొదట రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరును చేర్చినట్టు సమాచారం. కానీ రూరల్ విషయంలో కందుల దుర్గేష్‌కు స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇరుపార్టీల అధినేతలు వారి వారి అభ్యర్థులకు హామీ ఇవ్వడంతో రాజమహేంద్రవరం రూరల్ సీటుపై తర్జనభర్జన పడుతున్నారు. ఇద్దరినీ కూర్చొపెట్టి సర్దుబాటు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఇద్దరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం ఇద్దరికీ పోటీ చేసే అవకాశం ఇద్దామని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఒకరికి రూరల్ కేటాయించి, వేరే చోట మరొకరికి కేటాయిద్దామనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అవకాశం ఇచ్చి, జిల్లాలో మిగిలిన మరో జనరల్ స్థానం నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దింపడానికి నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. కందుల దుర్గేష్‌కు జనసేన వర్గాలు నచ్చచెబుతున్నట్టు సమాచారం. కొందరైతే రూరల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయమని సలహాలు ఇచ్చినా దానికి ఆయన అంగీకరించలేదని తెలిసింది. ఇంకా రూరల్ సీటు మీదే ఆయన నమ్మకం పెట్టుకున్నారు.ఈ వారంలోనే సీటు విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే నిడదవోలు టీడీపీ వర్గాల్లో అలజడి మొదలైంది. అక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరినీ కాదని జనసేనకు ఇస్తారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే శేషారావు ఇంటికి వెళ్లారు. కానీ శేషారావు మాత్రం తనకు ఇంత వరకూ అధిష్టానం నుంచి ఎటువంటి సమాచారం రాలేదని..ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పడం గమనార్హం. కుందుల సత్యనారాయణ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉండడంతో ఆయనకు పలువురు ఫోన్‌లు చేసి పరిస్థితిని ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అధిష్టానం నిడదవోలు సీటు జనసేనకు ఇవ్వడానికి నిర్ణయిస్తే అక్కడి నేతలతో కూడా చర్చించే అవకాశం ఉంది. ఎన్నికలకు ఇక ఎన్నో రోజులు లేవు. త్వరలో నోటిఫికేషన్ రానుంది. ఈ సీట్ల విషయం త్వరగా తేలిపోతే ప్రజల్లో మరింతగా పనిచేసుకోవాలనే ఆలోచనతో ఆశావహులు ఉన్నారు. త్వరలో టీడీపీ, జనసేన అధినేతలు ఈ సీట్ల విషయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇక జిల్లాలో ఇప్పటికే మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డివాసు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణలను ఉమ్మడి అభ్యర్థులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ జనసేన టీడీపీ ఐక్యత కనిపించింది. రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డివాసుకు అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తిలో రామకృష్ణారెడ్డికి మర్రెడ్డి శ్రీనివాసరావు జనసేన నాయకులు అండగా నిలబడుతున్నారు.అదే విధంగా రాజానగరంలో బత్తుల బలరామకృష్ణకు టీడీపీ నాయకుడు బొడ్డు వెంకట రమణచౌదరి అండగా ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ పొత్తు ధర్మంలో బాగంగా నాయకులు కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకున్నారు. ఇంకా టీడీపీ నాలుగు చోట్ల అభ్యర్థులను ఖరారు చేయనుంది. రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించనుంది. గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారైనట్టు పార్టీవర్గాలు చెబుతున్నాయి. కానీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కొవ్వూరులో మాత్రం అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టత లేదు. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ జవహర్ ఆశిస్తున్నారు. ఒక వర్గం గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేరుతో పాటు మరికొన్ని పేర్లు సూచిస్తున్నట్టు గమనార్హం. టీడీపీ మూడు చోట్ల ప్రకటించింది. అయితే ఇరుపార్టీలు అధికారికంగా అభ్యర్థులను ప్రకటించిన నియోజకవర్గం రాజమహేంద్రవరం అర్బన్ మాత్రమే. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుంచి ఆదిరెడ్డి వాసు, వైసీపీ నుంచి ఎంపీ మార్గాని భరత్ బరిలో ఉన్నారు.ఈ ఇద్దరి మధ్యే ఇక్కడ పోటీ జరగనుంది. ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ చేసినా ప్రధాన పోటీ ఈ అభ్యర్థుల మధ్యే ఉంటుంది. ఇక ఇరుపార్టీలు అభ్యర్థులను ప్రకటించిన నియోజకవర్గాలు ఏమీ లేవు. సోమవారం ఆయా నియోజకవర్గాల సస్పెన్స్ వీడే అవకాశం ఉంది.

నిడదవోలు నుంచి పోటీ చేయమన్నారు..

- అధిష్టానం పిలుపు ఇచ్చింది..
- కార్యకర్తలతో మాట్లాడి వెల్లడిస్తా
- జనసేన నేత కందుల దుర్గేష్



నిడదవోలు నుంచి పోటీ చేయమని జనసేన అధిష్టానం నాకు చెప్పడం వాస్తవమే.నేనింకా కార్యకర్తలు, పార్టీనేతలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఒక వీడియో సందేశాన్ని పంపించారు. రాజమహేంద్రవరం రూరల్ జనసైనికులకు, వీరమహిళలకు నమ స్కారం చెబుతూ, కొన్ని పరిస్థితుల నేపథ్యంలో మన పార్టీ అధినాయ కత్వం రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి విషయంలో కొన్ని ఆలోచనలు చేస్తుందన్నారు.అది ఏ రకమైన నిర్ణయమైనప్పటికీ కూడా మన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ ఆవేశకావేశాలకు లోనుకావొద్దన్నారు. మనం ముఖ్యంగా సుశిక్షితులమైన సైనికుల మాదిరిగా పనిచేస్తున్నవాళ్లం.. ఎట్టిపరిస్థితులలోనూ మనం సంయమనాన్ని కోల్పోవద్దని కోరారు.అంతా మంచే జరుగుతుందని, మన పార్టీని విజయం దిశగా తీసుకుని వెళ్లే విధంగా పనిచేయాలని కోరారు. పవన్‌కల్యాణ్ కూడా స్వయంగా చెప్పినట్టు సమాచారం. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఆయనతో మాట్లాడుతూ మన వాళ్లు పరిస్థితులను చక్కదిద్ది, అక్కడ నుంచి గెలిపిస్తారని కూడా ఆయనకు చెప్పినట్టు తెలిసింది.ఈ నేపథ్యంలో దుర్గేష్ జనసైనికులు, కార్యకర్తలు, తన శ్రేయాభిలాషులతో మాట్లాడి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కొనసాగుతున్న పాటంశెట్టి నిరసన దీక్ష

గోకవరం, ఫిబ్రవరి 25 : జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర దంపతుల నిరసన దీక్ష కొనసాగుతోంది. టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాలో జగ్గంపేట అభ్యర్థిగా టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేరును ప్రకటించడం పట్ల జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.ఈ నేపథ్యంలో ఆయన అంతిమ ఆమరణ నిరాహార దీక్ష పేరుతో గోకవరం మండలం అచ్యుతాపురం కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి నుంచి నిరసనకు దిగిన సంగతి తెలిసిందే.ఆహార పానీయాలను దరి చేరనీయకుండా ఆలయంలోనే సూర్యచంద్ర, ఆయన సతీమణి శనివారం రాత్రి నుంచి దీక్ష కొనసాగించడంతో స్వల్ప అస్వస్థతకు గురైనట్టు సమా చారం. సూర్యచంద్ర సీటు నిరాకరణకు గల కారణాలను రానున్న 48 గంటల్లో వివరించాలని జనసైనికులు కోరుతున్నారు.



టూచ్.. మూడ్‌న మారొచ్చు!

ఫ్యాను గాలిలో దుమారం

- బాంబు పేల్చిన వైవీ సుబ్బారెడ్డి
- వైసీపీలో ఏవరి సీటు చిరుగుతుందో
- 7 జాబితాల్లోనూ సమన్వయకర్తలే
- 3న 'సిద్ధం' సభలో అభ్యర్థుల ఖరారు
- సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల గుండెల్లో దడ
- బదిలీలు చేసిన స్థానాల్లోనూ మార్పు!
- నాలిక మడతపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పెట్టేశారు.. మళ్లీ నాలిక మడత పెట్టేశారు. వైసీపీ పెద్దలకు అలవాటైన పనే అయినప్పటికీ ఆ పార్టీ నాయకులకు మాత్రం తమ రాజకీయ భవిష్యత్తుపై వెన్నులో వణుకు అధికమైంది. ఇప్పటికే ఫ్యాను గాలి ఉన్నా స్థిమితంగా ఒక్కక్షణం కూర్చోలేని గడ్డు పరిస్థితిని అనుభవిస్తున్నారు. ఆహార్యంలో గంభీరాన్ని, ముఖంపై చిరునవ్వును పూసుకొని తిరిగేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ పార్టీ అతి ముఖ్యుల్లో ఒకరైన వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. పార్టీ నియమించిన సమన్వయకర్తలు ఇప్పటికే సీటు తమదేననుకొని ప్రమాణ స్వీకారానికి ఇక ఓట్లు రాబట్టుకోవడమే తరువాయి అనే భ్రమలో నియోజకవర్గాల్లోని ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో బిజీ అయిపోయారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం రూరల్‌కి మంత్రి వేణును సమన్వయకర్తగా ప్రకటించారు. ఆయన దానిని బదిలీ అనుకొని నియోజకవర్గంలో సంబురంగా తిరిగేస్తున్నారు. అలాగే గూడూరి శ్రీనివాస్ 'ఎంపీ' సీటు దక్కేసిందనే ఊహలో అసెంబ్లీ సెగ్మెంట్లలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను కలిసి మద్దతుపై 'లెక్క'లేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం సిట్టింగ్ ఎంపీ భరత్‌ని సిటీ ఇన్‌చార్జిగా నియమించడంతో సిటీ సీటు తనదేనని 'జీవించేస్తున్నారు'. ఈ నేపథ్యంలో అభ్యర్థులుగా స్వీయ ప్రకటితంగా చలామణీ అవుతున్న వైసీపీ ఇన్‌చార్జులు, సమన్వయకర్తలు, సిట్టింగుల్లో సీట్ల కింద దుమారం రేగేలా వైవీ సుబ్బారెడ్డి బాంబు పేల్చారు. 'టూచ్.. వాళ్లు అభ్యర్థులు కాదు.. సమన్వయకర్తలే' అని మెలికపెట్టారు. ఫైనల్ లిస్టు తర్వాతే అభ్యర్థులు అని స్పష్టం చేశారు. అంతే ఇప్పటి వరకూ వెలువరించిన ఏడు జాబితాలూ ముక్కున వేలేసుకోక తప్పలేదు. దీంతో తామంటే తామే బరిలో అనుకుంటున్న వాళ్ల గుండెలు ఒక్కసారిగా బరువెక్కాయి. అందరూ గప్‌చుప్‌గా ఉన్నా 'చిప్పు'లు సరిగా పనిచేయని పరిస్థితి ఉందనే చర్చ నడుస్తోంది.

అభ్యర్థులు కాదు.. కేవలం ఇన్‌చార్జిలే..

వైసీపీ ఇప్పటి వరకూ ఏడు జాబితాలు ప్రకటించింది. అయితే, అవన్నీ మారొచ్చు అనే సంకేతాలను వైవీ సుబ్బారెడ్డి తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. "సిద్ధం నాలుగో సభ కంప్లీట్ అయ్యాక మేనిఫెస్టో, లిస్టు రెండూ కూడా ఒకటి రెండు రోజుల తేడాతో రిలీజ్ చేసే కార్యక్రమం జరుగుతుంది.. ఇప్పటి వరకూ మేం మార్పులు చేర్పులు చేసినా వాళ్లు 'సమన్వయకర్తలే'..ఒక్కసారి లిస్ట్ అనౌన్స్ చేశాక తప్ప కుండా అభ్యర్థులుగా మారతారు." అంటూ జగన్ జమానాలో అలవాటుగా మారిన తీరుతో మడమ తిప్పేశారు. నాలుగో సిద్ధం సభ(చివరిది) మేదరి మెట్లలో వచ్చే నెల మూడున జరగనుందని సమాచారం. ఆ రోజున లేదా ఆ తర్వాత ఒకటి రెండు రోజుల తర్వాత ఫైనల్ జాబితా పేరుతో వైసీపీ నాయ కుల రాజకీయ భవిత్యం తేల నుంది. అయితే అప్పుడు ఎని మిదో జాబితా వెలువరించి.. ఫైనల్ తర్వాత అంటారేమోననే సందేహం కూడా చక్కర్లు కొడుతోంది. దీంతో ఎవరు సీటుకు ఎసరు పెట్టారో తెలియని గందరగోళంతో వైసీపీ నాయ కులు ఒత్తిడిలో పడిపోయారు. అయితే.. ఈ ప్రకటన వెనుక మరో మైండ్‌గేమ్ ఉందనే వాదనా వినవస్తోంది. ముందు నుంచీ పార్టీలో ఉన్నా అకస్మాత్తుగా ఎవరినో తీసుకొచ్చి అప్పటి వరకూ సేవ చేసిన వాళ్లను పక్కకు పొమ్మనడం తదితర కారణాలతో ఆ పార్టీ నాయకులు విసిగిపోయారు.వాళ్లను మళ్లీ మభ్యపెట్టడానికే సుబ్బారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారనే వాదనా ఉంది.

"ఆంధ్రజ్యోతి' 'అంతర్మథనం' నిజమే..

జిల్లాలో ఎంపీ మార్గాని భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తప్పించి అర్బన్ కోఆర్డినేటర్‌గా, మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురం నుంచి తప్పించి రూరల్ కోఆర్డినేటరుగా, మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి తప్పించి గోపాలపురం సమన్వయకర్తగా, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును అక్కడ నుంచి తప్పించి కొవ్వూరు సమన్వయకర్తగా, రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డా. గూడూరి శ్రీనివాస్‌ను లోక్‌సభ కోఆర్డినేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. వీరంతా తామే అభ్యర్థులమని చెప్పుకుంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఇంకా కోఆర్డినేటర్ పదవి కూడా దక్కని నిడదవోలు, రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేల్లో కూడా ఆందోళన మొదలైంది. కేడర్ కూడా ఆందోళనకు గురవుతోంది. కోఆర్డినేటర్లు అభ్యర్థులు కాకపోతే వీరి స్థానంలో ఎవరొస్తారో, ఎవరుంటారో తెలియక క్యాడర్ అయోమయంలో పడింది. వైసీపీలో ఈ గందరగోళంతో నాయకులు పడుతున్న ఆవేదనను 'అంతర్మథనం' శీర్షికతో ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. జగన్ స్థిమితం లేని నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుంటే ఎమ్మెల్యేగా నామినేషన్ సమర్పించే వరకూ అభ్యర్థులుగా ప్రచారంలో ఉన్నా వారిలో అయోమయం అలాగే ఉందని, బీఫాం చేతికి వచ్చాక గానీ అభ్యర్థిత్వం ఖరారు కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో 'ఆంధ్రజ్యోతి' చెప్పింది అక్షర సత్యమని రుజువైంది.

కొందరిలో చిగురిస్తున్న ఆశలు

వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో ఇప్పటికే తమదే స్థానమంటూ చలామణీ అవుతున్న వాళ్లకు దడ పుట్టగా.. కొందరిలో ఆశ మళ్లీ చిగురిస్తోంది. సీటు కోసం మళ్లీ 'ప్రయత్నాలు' మొదలు పెట్టారని తెలుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్‌లో చందన నాగేశ్వర్ ముందు నుంచీ వైసీపీలో చురుగ్గా ఉన్నారు. తనకంటూ ఓ కేడర్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆయనను పక్కన పక్కన పెట్టేసి వేణును తీసుకొచ్చారు. దీంతో ఆయన తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. పైకి పార్టీలో తిరుగుతున్నా ఆయన వర్గంలో అంతర్లీనంగా చాలా ఆవేదన ఉందని సమాచారం. రాజమహేంద్రవరం ఎంపీ సీటు తనదేనని అనసూరి పద్మలత ముందు నుంచీ ఆశ పెట్టుకున్నారు. అయితే పార్టీలో చురుగ్గా తిరుగుతున్న ఆమెను కాదని చివరికి అదే సామాజిక వర్గానికి చెందిన గూడూరి శ్రీనివాస్‌ని తెరపైకి తెచ్చారు. వైసీపీ పెద్దలను నమ్మిన అనసూరికి నిరాశే మిగిలింది. హోం మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించి, అక్కడున్న తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు.తాను కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే గోపాలపురంలో తనకు ఎవరు ఓటేస్తారంటూ హోంమంత్రి తన అంతరంగికుల వద్ద వాపోతున్నట్టు చెబుతున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చినా అయనలోనూ అదే అసహనం ఉందట. ఈ నేప థ్యంలో మళ్లీ 'కోరుకున్న' మార్పు జరుగుతుందా? అనే ఆశలో ఆశావహులు ఉన్నారు.



కనిపించడం లేదా! అక్రమం!

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తే కారణం
- మరో పక్క రాజకీయ ఒత్తిళ్లు
- ఏడాదిగా పట్టించుకోని వైనం
- భయపడని భవన యజమానులు

సామాన్యుడు బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న షాపు నిర్మాణం చేస్తేనే రూల్స్ బ్రేక్ చేశారని దయలేకుండా కూల్చి వేసే అధికారులకు... నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన పెద్దల కట్టడాలు కనిపించకపోవడం శోచనీయం. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించి మళ్లీ కూల్చివేత ప్రారంభిస్తారా లేక మళ్లీ పాత పాటే పాడుతారో వేచి చూడాలి. అక్రమ కట్టడాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తుంది.

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25 : జిల్లాలో అక్రమ కట్టడాలు పాలకులు.. అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. అక్రమంగా కట్టడాలు కట్టేస్తున్న యాజమాన్యాలు అటుపై సంబంధిత అధికారులు తనిఖీలకు రాకుండా తాయిలాలు ముట్టచెబుతున్నారు. పెద్ద ఎత్తున లక్షల్లో నగదు చేతులు మారుతుందనడానికి చర్యలు లేకపోవడమే నిదర్శనం. రాజకీయ ఒత్తిడితో మరి తమ కట్టడాల వైపు చూడకుండా చేసుకునే పరిస్థితులు రాజమహేంద్రవరంలో అక్రమార్కులకు ఉన్నాయి. అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తాం.. అది చేస్తాం.. ఇది చేస్తాం అని రెండు రోజులు హడావుడి చేసి అటుపై నిమ్మకుంటున్నారు.రాజమహేంద్రవరంలో అక్రమ కట్టడాలు చాలా ఉన్నాయి. అయినా వాటివైపు కన్నెత్తి చూడడం లేదు.

160 కట్టడాలకు నోటీసులు

రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలు 160 ఉన్నట్టు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. మరి 160 కట్టడాలు కట్టే వరకు ఈ అధికారులు ఏమి చేశారో అర్థం కాని పరిస్థితి ఉంది.గతేడాదే 160 కట్టడాలను గుర్తించి కమిషనర్ నోటీసులు కూడా ఇచ్చేశారు. అంతే వాటిలో కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయి వాటిని మినహాయిస్తే మిగిలిన వాటి పరిస్థితి ఏంటో ఇంత వరకు వాటిని ఎందుకు టచ్ చేయలేదో అర్థంకాని పరిస్థితి. అక్రమ కట్టడాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలిసి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఏదైనా అక్రమ కట్టడాలపై అడిగితే ఎన్నికల నిర్వహణ శిక్షణలో ఉన్నట్టుగా అధికారుల నుంచి సమాధానాలు వస్తున్నాయి.ఇప్పుడు ఎన్నికల శిక్షణలో ఉన్నారు సరే గతేడాది కాలం గా ఏమిచేశారో వారికే తెలియాలి.వీరి నిర్లక్ష్యం అక్రమ కట్టడాల నిర్వాహకులకు ధైర్యం పెంచుతోంది.రాజమహేంద్రవర నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు గడేడాది ఏప్రిల్ నెలలో నగరంలో అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించారు. నగరంలో గెయిల్ ఆఫీసు రోడ్డు, ఇన్నీసుపేట, మెరకవీధి, మహవీర్ స్ట్రీట్ తదితర ప్రాం తాల్లో సుమారు 30 అక్రమ కట్టడాల శ్లాబులను కట్ చేశారు. అంతే మళ్లీ ఏమైందో నోటీసులు ఇస్తున్నామని వదిలేశారు. ఇప్పుడు ఎన్నికల శిక్షణ పేరుతో వాటిని పక్కన పెట్టేశారు. గతంలో నగరంలో జరిగిన అక్రమ నిర్మాణాల్లో ఎంపీ భరత్ రామ్ అనుచరుల ఒత్తిడి వల్ల కొన్ని అక్రమ కట్టడాలను అధికారులు టచ్ చేయలేదు.ఆ తరువాత చాలా నిర్మాణాలు యధేచ్ఛగానే కట్టేశారు. కొం దరు అధికారులు ఆయా భవనాల దరిదాపులోకి వెళ్ళకుండా రాజకీయ ఒత్తిళ్లు పని చేశాయి. దానవాయిపేట,గాంధీ పురం,మెయిన్ రోడ్డు, జెండా పంజా రోడ్డు తది తర ప్రాంతాల్లో అక్రమ కట్ట డాలు ఉన్నాయి.అయ్యా అధికారులు ఒకసారి అటు చూడండి.. అక్రమాల పనిపట్టండి.





గతేడాది జరిగిన అక్రమ కట్టడాల కూల్చివేత(ఫైల్)

ఎంపీ భరత్‌పై అసత్య ప్రచారమని కార్యకర్త ఫిర్యాదు

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎంపీ భరత్‌పై సోషల్ మీడియాలో, కరపత్రాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ వైసీపీ కార్యకర్త లక్ష్మణ్ కుమార్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎంపీ భరత్ రామ్ బీజేపీతో మంతనాల్లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'భరత్ లవ్ 25% కమీషన్.. ఇసుక అక్రమ రవాణా, ప్రభుత్వ కాంట్రాక్టు, ఈట్ స్ట్రీట్, మాదక ద్రవ్యాల ఎగుమతి, గ్రావెల్,గ్రానైట్, అవభూములు, కంబాల చెరువు, సుబ్రహ్మణ్య మైదానం పనుల్లో 25 శాతం కమీషన్.. పనేదైనా.. పర్సంటేజీ చెల్లించాల్సిందే.. 25% కమీషన్ భారత్‌పే రేట్ కార్డ్ అంటూ కరపత్రాలు ముద్రించి పంచిపెడుతున్నారన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కరపత్రాలపై రగడ పది రోజుల నుంచీ నలుగుతోంది.ఎంపీ భరత్ పోలీసులపై తీవ్ర ఒత్తిడి తెస్తు న్నారు. కరపత్రాలు ముద్రించి పంచిపెడుతున్నది ఎవరో తెలియాలని పోలీసులను ఎంపీ భరత్ ఈ నెల 16న ఆదేశించారు.దీంతో పోలీసులు అదే పనిలో ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షకు 15,709 మంది హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ మాదవీలత పేర్కొన్నారు. 18501 మంది అభ్యర్థులకు 15,709 మంది 84.91 శాతం హాజరయ్యారని తెలిపారు. రాజమండ్రి డివిజన్‌లో 35, కొవ్వూరు డివిజన్‌లో 18 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదన్నారు. కలెక్టర్ మాదవీల, జేసీ తేజ్ భరత్, డీఆర్వో నరసింహులు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అంతకుముందు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరీక్షా గదిలోకి అనుమతించారు.



తాళ్లపూడిలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల క్యూ.. రాజానగరంలో పరిశీలిస్తున్న జేసీ

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


వేలివెన్నులో శేషారావు స్వగృహానికి వచ్చిన టీడీపీ శ్రేణులు

కార్యకర్తలు ఆందోళన చెందవద్దు

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 25: నిడదవోలు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై ఆదివారం ఉదయం నుంచి వస్తున్న వార్తల నేపథ్యంలో రాత్రి వేలివెన్నులోని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు స్వగృహానికి భారీగా టీడీపీ శ్రేణులు నియోజకవర్గం నుంచి వచ్చారు. ఈ సందర్భంగా వారితో శేషారావు మాట్లాడారు. ఎటువంటి ఆందోళన చెందవద్దని, తనకు అధిష్టానం నుంచి గాని, పెద్దల నుంచి గాని ఎటువంటి సమాచారం రాలేదని అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు నిమగ్నమవ్వాలని కోరారు. ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరిగే బహిరంగ సభకు శ్రేణులంతా హాజరై విజయవంతానికి కృషి చేయాలని శేషారావు కోరారు. ఆయన నివాసానికి నిడదవోలు టౌన్, రూరల్, పెరవలి, ఉండ్రాజవరం మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చారు.

కోట సత్తెమ్మకు కోటి దండాలు



నిడదవోలు, ఫిబ్రవరి 25: కోట సత్తెమ్మకు కోటి దండాలు అంటూ గోదావరి జిల్లాల వాసులు ఆదివారం తిమ్మరాజుపాలెంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. ఉచిత, ప్రత్యేక దర్శనం అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,46,157 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యాలయం తెలిపింది.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ


తాడిమళ్లలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఫిబ్రవరి 25: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో రోటరీక్లబ్, ఇంట్రాక్ట్ క్లబ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పోలియో వ్యాధి నిరోధక చుక్కలు (పల్స్ పోలియో)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధి దరిచేరకుండా రక్షించుకోవచ్చన్నారు. మార్చి 3న పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలదాసు శ్రీనివాసరావు, గొన్నాబత్తుల రామారావు, కాళ్ల రాంబాబు, శివకుమార్, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లులో అన్నసమారాధన

చాగల్లు, ఫిబ్రవరి 25: చాగల్లులో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలు వేడుకగా జరిగాయి. నాలుగు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్నసమారాధన చేపట్టారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుందరేశ్వరస్వామి ఆలయంలో లక్షబిళ్వార్చన


గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు, ఫిబ్రవరి 25: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి, సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని శ్రీలలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన నిర్వహించారు. సుందరేశ్వర స్వామి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో తాళ్లపూడి మండలం బల్లిపాడుకు చెందిన కాకర్ల శ్రీనివాస్ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు, రుద్రహోమం జరిపించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో అనుపిండి చక్రధరరావు, కలిగొట్ల కృష్ణారావు, తెన్నేటి సూర్యనారాయణమూర్తి, దుర్వాసుల కృష్ణమూర్తి, పుల్లే సత్యనారాయణ, వాడ్రేవు సాయి కామరాజు పాల్గొన్నారు. ఆదివారం సందర్భంగా సూర్యనారాయణమూర్తికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా 'మానవత' సేవలు


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దేవరపల్లి, ఫిబ్రవరి 25: మానవత సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సంస్థ మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ చెప్పారు. ఆదివారం మండలంలోని పల్లంట్లలో షాలోమ్ చర్చిలో ఈడుపుగంటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ కుల, మతాలకు అతీతంగా సేవలు నిర్వహించే ఏకైక సంస్థ అన్నారు. ఈ సందర్భంగా పల్లంట్లలో ఇటీవల మృతిచెందిన కట్టా వెంకటేశులు కుటుంబానికి సంస్థ తరఫున ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కొయ్య అబ్బులు, ఈ.డేవిడ్‌రాజు, రాయుడు సూర్యకాంతం, ఆచంట సుభాష్‌చంద్రబోసు, బొల్లం వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేత

నల్లజర్ల, ఫిబ్రవరి 25: మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన సామాజికవేత్త వసంతాడ ఆనంద్ స్వరూప్ దేవరపల్లి మండలం గొల్లగూడెంలో ఉన్న దివ్యాంగుల ఆశ్రమానికి 12 సీలింగ్ ఫ్యాన్లు అందించినట్టు చెప్పారు. ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాష్కరరావుకు ఫ్యాన్లు అందించారు. ఫ్యాన్ల కొనుగోలుకు పలువు దాతలు సహకరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆందుగుల వెంకటేశ్వరరావు, పోలుపాం చిన్నారావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అక్కినేని అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25: జిత్ మోహన్ మిత్రా కళావేదికలో అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి సంవత్సరం సందర్భంగా నెలవారీ సభలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుక్కురెడ్డి శ్రీనివాసరావును అక్కినేని పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు వెంకటేశ్వరరావు, ముద్రగడ సోమరాజునాయుడు, శేషగిరిరావు, అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ జనసేన సభను జయప్రదం చేయండి

▸ టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు


కొవ్వూరులో అభివాదం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 25: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎన్నికల శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. ఆదివారం కొవ్వూరులోని జనసేన కార్యాలయంలో రెండు పార్టీల సమన్వయ కమిటీ సమావేశం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ద్విసభ్య కమిటీ మాట్లాడుతూ సీఎం జగన్ రాక్షసపాలనను అంతమొందించడానికి రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ-జనసేన కూటమి 34 సీట్లు కైవసం చేసుకుంటుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలిసి ప్రకటించిన 99 మంది అభ్యర్థులు ఉమ్మడి అభ్యర్థులేనని కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా విజయం కోసం కృషిచేయాలన్నారు. రామారావు మాట్లాడుతూ ఇక్కడ చెత్త అక్కడ బంగారం, అక్కడ చెత్త ఇక్కడ బంగారం కాదని తెలుసుకోవాలన్నారు. కొవ్వూరులో టీడీపీ-జనసేన నుంచి అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న వారిలో ఎవ్వరికి సీటు ఇచ్చినా వారితో కలిసి పనిచేయడానికి సిద్ధమన్నారు. గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం సభకు నియోజకవర్గం నుంచి 25 వేల మంది హాజరయ్యేలా క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, మండలాధ్యక్షులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేష్, సూర్యదేవర రంజిత్, మరపట్ల కళాధర్, డేగల రాము, సుంకర సత్తిబాబు, గంగుమల్ల స్వామి, బూరయ్య, తేజ పాల్గొన్నారు.


గోపాలపురం సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

గోపాలపురం: గోపాలపురం జనసేన కార్యాలయం వద్ద వడ్డి రామలీలాధర్ అధ్యక్షతన ఆదివారం విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడారు. టీడీడీ-జనసేన కూటమి నిర్వహించే పొత్తులో భాగంగా తాడేపల్లిగుడెంలో జరిగే మొట్టమొదటి బహిరంగ సభకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి 5 లక్షల మంది హాజరౌతారని, నియోజకవర్గం నుంచి వేలాదిగా నాయకులు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని 40 ఏళ్ల వెనక్కి తీసుకుపోయారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో దారిలో పెట్టాలంటే సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఉత్తుత్తి బటన్లు నొక్కే జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణానికి బటన్లు ఎందుకు నొక్కడం లేదని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అంతం.. జనసేన పంతం.. అని పొత్తులో భాగంగా ఎవరికి టిక్కెట్లు ఇచ్చినా చిత్తశుద్ధితో పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు పోలనాటి రాజేంద్ర, చోడసాని బాపిరాజు, కాట్నం గణేష్, డాకారపు నరశింహమూర్తి, పోసిన గణపతి, జిజిమొగ్గల శ్రీను, సప్పటొ శివ, పోలిమాటి నాని, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

నిడదవోలు, ఫిబ్రవరి 25: నిడదవోలులోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రం ఎస్‌ఐ పి.అప్పారావు వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

కొవ్వూరు: కొవ్వూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఏబీఎన్, వీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో గ్రూపు-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను డీఎస్పీ కేసీహెచ్ రామారావు పరిశీలించి, బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు, సలహాలను అందజేశారు.



నిడదవోలులో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు


కొవ్వూరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామారావు

కొవ్వూరులోని 3 పరీక్షా కేంద్రాల్లో 800 మందికి గాను 674 మంది మాత్రమే పరీక్షలకు హాజరు కాగా 126 మంది గైర్హాజరయ్యారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన 3 కేంద్రాల్లో 720 మందికి గాను 564 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటరమణ, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, గోపాలపురం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ పరిశీలించారు. ప్రతి సెంటరు వద్ద అభ్యర్థుల వసతులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

శ్మశాన వాటికకు వెళ్లేందుకు అగ్రవర్ణాల అడ్డంకులు

వనిత దృష్టికి పోతినీడుపాలెం దళితుల సమస్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : హోం మంత్రి


సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల, ఫిబ్రవరి 25: పోతినీడుపాలెంలో ఎస్సీలకు శ్మశాన వాటికకు వెళ్లేందుకు అగ్రవర్ణాలు వారు అడ్డంకులు కలిగిస్తున్నారని కాలనీ వాసులు హోం మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం మండలంలోని నభీపేట, చాదరాశికుంట, పోతవరం, సుభద్రపాలెం, కవులూరు, చీపురుగూడెం, పోతినీడుపాలెంలో గ్రామాల్లో ఆమె పర్యటించారు. పోతినీడుపాలెంలో దళితులు తమ సమస్యలను చెప్పుకొనే క్రమంలో వారికి, అగ్రవర్ణాల వారికి మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మంత్రి జోక్యం చేసుకుని ఇరు వర్గాల వారితో విడివిడిగా మాట్లాడి వారం రోజులు సమస్య పరిష్కరిస్తామన్నారు. అవసరమైతే భూసేకరణ చేసి శ్మశానవాటికను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నభీపేటకు చెందిన మర్రి సునీత తన కుమారుడు అశ్విన్‌కు పింఛన్ రావడం లేదని, దుప్పికుంట గ్రామంలో 30 ఇళ్లకు పట్టాలు ఇవ్వడం లేదని హోం మంత్రికి ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా మండలానికి ఒక పీఆర్వోను ఏర్పాటు చేసి పింఛను పెండింగ్, ఇళ్ల స్థలాల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్టు చెప్పారు.

వేళ్లచింతలగూడెంలో ఇళ్ల పట్టాల పంపిణీ

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెంలో 144 మంది లబ్ధిదారులకు మంత్రి తానేటి వనిత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకూ రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆవపాడులో నూతన పైపులైన్ ఏర్పాటు

▸ తీరిన కొత్తపేట వాసుల తాగునీటి కష్టాలు

▸ కాని నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయని అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నూతన పైపులైన్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ


పైపులైన్ నుంచి వస్తున్న నీరు

నల్లజర్ల, ఫిబ్రవరి 25: మండలంలోని ఆవపాడు ఎస్సీ కాలనీ కొత్తపేటకు నూతన పైపులైన్ వేసి తాగునీటి కష్టాలు తీర్చారు. ఈ నెల 18న ఆవపాడులో తాగునీటి కష్టాలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వెలువడిన కథనానికి గ్రామ సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ స్పందించారు. అదే రోజున కొత్త పైపులైన్ పనులు ప్రారంభించి శనివారం నాటికి పూర్తి చేశారు. ఆదివారం సురక్షిత మంచి నీరు కాలనీ వాసులకు అందించారు. 25 ఏళ్లుగా సుద్దమిళితమైన నీరు తాగుతున్నారని, రెండు కిలోమీటర్ల దూరంలో మోటార్ వేసి గ్రామానికి తాగు నీరు తీసుకుని రావడం ద్వారా అందరికి సురక్షిత మంచి నీరు చేరుతోందని సర్పంచ్ చెప్పారు. ఈ నెల 12న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయి ప్రజలకు తాగునీటి సమస్యలు నెలకొన్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో తాము పంచాయతీ నిధులతో నూతనంగా పైపులైన్ వేసి తాగునీరు అందించమన్నారు. అయితే ఇప్పటివరకు సైతం విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదన్నారు.

కాపులకు న్యాయం చేసింది టీడీపీనే

▸ వైసీపీ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయం

▸ కాపు,తూర్పుకాపు సమావేశంలో టీడీపీ-జనసేన నేతలు

▸ వాసును భారీ మెజార్టీతో గెలిపించాలి: ఆదిరెడ్డి

▸ రాజమహేంద్రవరం బాగుపడాలంటే భరత్‌కు డిపాజిట్లు కూడా రాకుండా చేయాలి: అనుశ్రీ


సమైక్య అభివాదం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25: కాపులకు, తూర్పుకాపులకు న్యాయం చేసింది టీడీపీయేనని ఆ పార్టీ ముఖ్యనేతలు అన్నారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన కాపు, తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. కాపులు, తూర్పుకాపుల సంక్షేమానికి ఆనాడు చంద్రబాబు కాపు కార్పొరేషన్ పెట్టి భారీగా నిధులు కేటాయించారని, విద్యార్థులకు విదేశీ విద్యనందించారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక కాపులను దగా చేశాడని మండిపడ్డారు. గెలుపు సంగతి తర్వాత ముందు సీటు తెచ్చుకో అని పదేపదే వ్యాఖ్యానించిన భరత్‌కు చెబుతున్నా నాకు సీటు ఖరారైంది.. నీకు సీటు ఇరిగిపోతుంది చూసుకో అని అన్నారు. రాజమహేంద్రవరంలో గంజాయి బ్యాచ్‌లు, బ్లేడుబ్యాచ్‌లను పెంచి పోషించిన వారికి చెబుతున్నాం టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చాక ఉక్కుపాదంతో తొక్కేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తన కుమారుడు వాసును ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన ఇన్ చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ కాపులను చాలా చులకనగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. రాజమహేంద్రవరం బాగుపడాలంటే భరత్‌కు డిపాజిట్లు రాకుండా చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి మాట్లాడుతూ ఆదిరెడ్డి వాసును అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను, దొండపాటి సత్యంబాబు, మజ్జి రాంబాబు, నల్లం శ్రీను, రెడ్డి మణి, గంటా స్వరూప, ప్రియసౌజన్య, జామి సత్యనారాయణ, మాలే విజయలక్ష్మి, వర్రే శ్రీనివాసరావు, వానిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న క్రీడాకారులు

మెడికో క్రికెట్ టోర్నీ విజేత 'ఆంధ్రా'

రన్నర్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు

రాజానగరం, ఫిబ్రవరి 25: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కళాశాల పురుషుల క్రికెట్ క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆరు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో 48 కళాశాలల నుంచి క్రీడాకారులు తలపడ్డారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు విన్నర్‌గా, రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచినట్టు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఇ.త్రిమూర్తులు ప్రకటించారు. నాకౌట్ విధానంలో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా 129పరుగులు, జీఎస్ఎల్ 117పరుగులు సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలపై రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, గుంటూరు మెడికల్ కళాశాలపై ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు విజయం సాధించినట్టు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

మోక్ష వేంకటేశ్వరుడికి వెండి నామాలు

బిక్కవోలు, ఫిబ్రవరి 25: కొంకుదురు గ్రామంలోని మోక్ష వేంకటేశ్వర స్వామికి గ్రామానికి చెందిన కర్రి క్రీస్తురెడ్డి, లలితాలక్ష్మి దంపతులు వెండి నామాలను ఆదివారం అందజేశారు. ఈ నామాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి స్వామికి అలంకరిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తేతల శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి తెలిపారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఎస్పీ



కడియం, ఫిబ్రవరి 25: కడియంలోని పల్ల వెంకన్న నర్సరీని ఆదివారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ సందర్శించారు. నర్సరీలో వివిధ రకాల పల, పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను చూశారు. నర్సరీ రైతు పల్ల వినయ్ మొక్కల వివరాలు, విశిష్టత, పెంపకం గురించి వివరించారు.

కొండపై నమ్మాళ్వారుల పరంపదోత్సవం

ముగిసిన నరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ, ఫిబ్రవరి 25: చారిత్రాత్మక కోరుకొండ కొండపై ఆదివారం నమ్మాళ్వారుల పరంపదోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు నరసింహస్వామికి ఐదు రోజులపాటు జరిగిన అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా స్వయంభు లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నాళాయర ప్రబంధ పారాయణం నిర్వహించారు. అలాగే అనంత పద్మనాభ స్వామి వాహన సేవలు ముగించారు. ఈ సందర్భంగా కొండపైన ఉన్న లక్ష్మీనరసింహస్వామిని, భగవత్ రామానుజులను, నమ్మాళ్వారులను ప్రత్యేక పల్లకితో తోడ్కుకుని వచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రఘునాథ బట్టర్, ఇరగవరపు కృష్ణమాచార్యులు, మార్గపురి రాంబాబు, పెదపాటి గిరిధరాచార్యులు, పెరవళి వంశీ, గొట్టిముక్కల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రంగనాథుని అధ్యయనోత్సవాలు ప్రారంభం.. రెండు రోజులు పాటు జరిగే శ్రీ భూ సమేత రంగరాజస్వామి అధ్యయనోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా అధ్యాపక స్వాములు ఉదయం, సాయంత్రం నాలాయర ప్రబంధాన్ని పారాయణం చేశారు.

అధికారులు, ఉద్యోగులపై చిన్నచూపు తగదు

ఐసీడీఎస్ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్రాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు


ఐసీడీఎస్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రాజు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 25 : సంక్షేమశాఖలో అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు, ఉద్యోగులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం తగదని ఐసీడీఎస్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న చందాసత్రంలో ఆదివారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఐసీడీఎస్ అనుబంధ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని కేడర్ ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా ఒకే గొడుగు కింద పనిచేయడానికి ఈ సమావేశం నాంది పలకాలన్నారు. సూపరింటెండెంట్ పోస్టు మంజూరు చేయాలని, సూపర్‌వైజర్లను యాప్‌ల ద్వారా వేధించడం తగ్గించాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం సీడీపీవో వి.నరసమ్మ, కాంట్రాక్టు సీడీపీవో రాజశేఖర్, ఎస్‌సీ పీసీఆర్ అధికారి మునిరాజు, డీసీపీవో రాష్ట్ర నాయకులు వెంకట్రావు, సోమశంకర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థ్‌రాయ్
వై.స్క్రీన్ 2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన

నిడదవోలు

వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	సిద్ధార్థ్‌రాయ్
శ్రీగణపతి	వ్యూహం

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్